క్లుప్తంగా

ప్రతిభ చాటిన విద్యార్థులు



మక్తల్: సైనిక పాఠశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో మక్తల్‌కు చెందిన విద్యార్థులు కౌశిక్‌రెడ్డి, ఎస్.సాత్విక్‌లు సత్తాచాటారని అక్షర పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రెడ్డి బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ మేరకు వారిని అభినందించారు. జిల్లా ఎంపీటీసీల సంఘం ఉపాధ్యక్షుడు బాల్‌రాంరెడ్డి , జిల్లా బీజేపీ నాయకుడు కర్నిస్వామి విద్యార్థులను సన్మానించారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని మైనార్టీ కాలనీ లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నారు. ఈ మేరకు మైనార్టీ కాలనీ పోరాట సమితి అధ్యక్షులు సాదిక్ మాట్లాడుతూ సుభాష్ రోడ్ నుంచి ఉదయం 11 గంటలకు ర్యాలీ ప్రారంభమై కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగుతుందన్నారు. లబ్ధిదారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా బండారోత్సవాలు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో బుధవారం ఎల్లమ్మ బండారోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు.ఆలయ ఆవరణలో పటం వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బండారు చల్లుకున్నారు. బంధువులు తెచ్చిన నూతన దుస్తులను ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బైరి నరేష్‌పై ఫిర్యాదు



నారాయణపేట టౌన్ : దాదాపు రెండు నెలల కిందట అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. బుధవారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ ఆరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలన్నారు. బజరంగ్‌దళ్ నాయకులు రవికుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రావన్‌కుమార్, నీరటి వెంకటేష్, ఉపాధ్యక్షుడు చేతన్, ఆకాష్, బాలు, విజయ్, చింటూ, వసంత్, అరుణ్, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు



మరికల్: మండలంలోని లాల్‌కోట చౌరస్తాలో ఉన్న గౌతమి మోడల్ స్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా విధులు చేపట్టి ఆకట్టుకునేలా పాఠాలు బోధించారు. వారిని కరస్పాండెంట్ రాజేందర్ రెడ్డి అభినందించారు.

ఇసుక రవాణాకు అనుమతివ్వాలని ధర్నా

అమరచింత: ఎండ్ల బండ్లతో ఇసుకను రవాణా చేయడానికి అనుమతి ఇవ్వాలంటూ ఎడ్ల బండ్ల యజమానులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఇసుక రవాణా కోసం చేస్తున్న ధర్నాకు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఇంటి నిర్మాణాల కోసం ఇసుక కొరత ఉందని, దీంతో తప్పని పరిస్థితుల్లో ఎడ్ల బండ్లతో ఇసుకను రవాణా చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం అంటూ ఆందోళనకు పూనుకున్నారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఇసుక రవాణా చేయడానికి అనుమతులు లేవని, ధర్నా విరమించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ట్రై సైకిల్ ఇప్పించండి సారూ..

దేవరకద్ర: నడవలేని స్థితిలో ఉన్నాను.. ఆర్థిక పరిస్థితి కూడా బాగా లేదని.. తనకు వీల్ ట్రై సైకిల్ ఇప్పించాలని మండలంలోని అడవి అజిలాపూర్‌కు చెందిన దివ్యాంగుడు సత్యయ్య కలెక్టర్ రవిని వేడుకున్నారు. బుధవారం కలెక్టర్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ అనంతరం తిరిగి వెళ్తుండగా, వీల్ చైర్‌పై అక్కడికి వచ్చిన సత్యయ్య తన గోడు చెప్పుకున్నాడు. వీల్ చైర్‌ను ఎవరైనా తోసుకుంటూ రావాల్సి ఉంటుందని, ట్రై సైకిల్, మూడు చక్రాల స్కూటీ అయితే సొంతంగా తిరిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపాడు. మండల పరిషత్‌లో దరఖాస్తు చేసుకుంటే ట్రై సైకిల్ మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఎండలో ఎదురుచూడాల్సిందే!

- బస్‌స్టాండ్‌ల వద్ద షెల్టర్లు కరువు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- సౌకర్యాల కల్పనపై దృష్టిసారించని అధికారులు



జిల్లా కేంద్రంలో పాతబస్టాండ్ వద్ద ఓ దుకాణం ముందు కూర్చున్న ప్రయాణికులు



జిల్లాకేంద్రంలో బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని ఆయా ప్రదేశాలలో ఉన్న బస్‌స్టాండ్‌ల వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కనీసం ఆయా చోట్ల షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. సాధారణంగానే జిల్లా కేంద్రానికి పలు ప్రాంతాల నుంచి నిత్యం వివిధ అవసరాల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతుంటారు. వీరిలో ఎక్కువ శాతం సామాన్య మధ్య తరగతి ప్రజలే కావడంతో ఎక్కువగా బస్సుల్లోనే ప్రయాణం చేస్తుంటారు. కాగా వారు బస్సుల కోసం ఆయా స్టాప్‌ల వద్ద షెల్టర్లు లేకపోవడంతో ఎండలోనే నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రానున్న రోజుల్లో తీవ్రంగా అవస్థలు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయా చోట్ల పరిస్థితి ఇలా..

జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి నిత్యం దామరగిద్ద, పరిగి హైదరాబాద్, కోడంగల్, మద్దూర్, పెదిరిపాడ్, రేనివెట్ల ఇతర గ్రామీణ పాంత్రాలకు బస్సు సర్వీసులు నడుస్తుంటాయి. కానీ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు హోటళ్ల ఎదుట, ఎక్కడైన చెట్లు ఉంటే అక్కడ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. అదేవిధంగా సెంటర్ చౌక్, సుభాష్‌రోడ్, హైదరాబాద్ రోడ్‌లోని అంబేద్కర్ చౌరస్తా, యాద్గీర్ రోడ్‌లో సైతం షెల్టర్లు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. దీంతో ఇప్పటికైనా ఆయా చోట్ల కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

షెల్టర్లు ఏర్పాటు చేయాలి

జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లలోని స్టాప్‌ల వద్ద షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అంబేద్కర్ చౌరస్తాలో కనీసం నీడ లేక ఎండలో నిలబడి బస్సు రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. షెల్టర్ల నిర్మాణం చేపట్టి సమస్యల పరిష్కరించాలి.

– గణేష్, తిర్మలాపూర్

సమస్య పరిష్కరిస్తాం

గతంలో బస్‌స్టాప్‌లు ఉన్న వద్ద షెల్టర్ల ఏర్పాటుపై ఆర్టీసీ, ఇతర అధికారులతో చర్చించాం. షెల్టర్లు అవసరమైన ప్రాంతాలను గుర్తించాం. వాటి ఏర్పాటు కోసం త్వరలోనే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– గందె అనసూయ, మున్సిపల్ చైర్‌పర్సన్, నారాయణపేట

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

నారాయణపేట రూరల్ : సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్ ఫోన్ ఇవ్వరాదన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా: సైబర్ నేరాలపై కృష్ణా ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎస్‌ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెచ్‌ఎం నిజాముద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాగనూర్: అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మాగనూర్ ఏఎస్‌ఐ అంజన్ రావు అన్నారు. బుధవారం మాగనూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల నుంచి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సిబ్బంది కృష్ణప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనే లక్ష్యంగా సమ్మె



మాట్లాడుతున్న బాల్‌రాం

నారాయణపేట టౌన్ : ఐసీడీఎస్ సంరక్షణ, అంగన్‌వాడీల హక్కుల సాధనే లక్ష్యంగా సమ్మె చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద జరిగిన సమ్మెలో పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సీడీపీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, పవన్, ఊట్కూర్, ధన్వాడ మండలాల యూనియన్ నాయకులు ఇందిరా, లక్ష్మి, రాణి, శారద, లక్ష్మీబాయి, అర్చన, చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: అంగన్‌వాడి టీచర్లను, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నారాయణపేట జిల్లా యూనియన్ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. బుధవారం మక్తల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఐసీడీఎస్ ప్రాజెక్టు ముందు ధర్నా చేశారు అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కో కన్వీనర్ గోవింద్‌రాజ్, జిల్లా కార్యదర్శి మంజుల, విజయలక్ష్మి, చంద్రకళ, రాజేశ్వరి, సురేఖ, జయమ్మ, గంగమ్మ, ప్రసన్న, కృష్ణ, గిరిజ, సునంద, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయం వృథా చేయరాదు



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి కృష్ణామాచారీ

మద్దూరు: పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు సమయం వృథా చేయకుండా లక్ష్యంతో కష్టపడి చదవాలని జిల్లా సంక్షేమాధికారి కృష్ణామాచారీ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, అల్పాహారంపై అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని హాస్టల్ వార్డెన్ మంజులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

సమాజసేవలో యువత ముందుండాలి



బాటసారులకు నీరు అందిస్తున్న సీఐ రవిబాబు

నారాయణపేట రూరల్ : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో యువత చురుకైన పాత్ర పోషించాలని సీఐ రవిబాబు అన్నారు. పట్టణంలోని డీపీఎం పాఠశాల 2008–09 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చుతో చలివేంద్రం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. చలివేంద్రాన్ని సీఐ ప్రారంభించారు. యువకులను అభినందించారు. కార్యక్రమంలో సులెగం సురేష్, నరేష్, కృష్ణ, గంగాధర్, సాగర్, నిధిన్, వెంకటేష్, రవి పాల్గొన్నారు

'విద్యావంతులనే మండలికి పంపాలి'



ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : మేధావులతోనే చట్ట సభలకు గౌరవం పెరుగుతుందని విద్యావంతుడైన జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ వినయ్‌బాబును మండలికి పంపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్, బహుజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేష్‌లు కోరారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్, పీహెచ్‌ఈఎస్, మార్కెట్‌లేన్ , కేజీబీవీ గురుకుల పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఇళ్లకు వెళ్లి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రెడ్డప్ప, రమేష్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం'

నారాయణపేట రూరల్ : కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ సంఘం కృషిచేస్తుందని జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. నారాయణపేట, దామరగిద్ద కేజీబీవీల్లో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తద్వారా సమస్యల పరిష్కారం చేసుకోవడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంతోష్‌కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.



చెన్నకేశవ రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న నాయకుల

టీడీపీ కోఆర్డినేటర్‌గా వెంకటప్రసాద్

కోస్గి: టీడీపీ కోడంగల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా కోస్గి పట్టణానికి చెందిన సామల వెంకట్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక పత్రం అందజేశారు. తనను గుర్తించి నియమించిన పార్టీ అధిష్టానానికి ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి సన్మానించారు. ప్రసాద్ ఎంపికపై కోస్గి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సిలిండర్ ధరలు తగ్గించాలి

మరికల్: పెంచిన సిలిండర్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వీరన్న, నాయకులు రామకృష్ణ, హరీష్‌లు అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సిలిండర్‌పై రూ. 50 పెంచడం వల్ల మరోసారి వినియోగదారులపై భారం పడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 400కే సిలిండర్ అందజేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 9 ఏళ్లలో పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలను పెంచుతూ సామాన్యులను కోలుకోకుండా చేసిందన్నారు.

శిక్షణా తరగతులకు తరలిన మత్స్యకారులు



ధన్వాడ: ప్రభుత్వం ప్రారంభించిన శిక్షణా తరగతులకు ధన్వాడ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో కార్మికులు హైదరాబాద్‌కు బుధవారం తరలివెళ్లారు. అధ్యక్షులు నర్సిములునాయుడు, ఉపాధ్యక్షులు సందబాల్ నర్సిములు, కార్యదర్శి నర్సిములు, డైరెక్టర్లు ఆనంద్, బాలస్వామి, వెంకటయ్య, శివరాయులు, అశోక్, నారాయణ, కాశిమన్న, బాలయ్య, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

కాంప్లెక్స్‌స్థాయిలో ఇంగ్లిష్ టెస్ట్



ఇంగ్లిష్ టెస్ట్ ప్రారంభిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సిములు

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎస్ఈఈడీఏ వారి ఆధ్వర్యంలో బుధవారం కాంప్లెక్స్‌స్థాయిలో ఇంగ్లిష్ వకాబులరీ టెస్ట్ నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సిములు దాదాపుగా 36 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. టాపర్‌గా నిలిచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, లక్ష్మారెడ్డి, శివరాజప్ప, తిమ్మన్న, శ్రీనివాసులు, డెవిన్, లక్ష్మణ్, హుస్సేన్, సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడ్మూర్‌లో..

నర్వ: విద్యార్థుల్లో ఇంగ్లిష్ స్పెల్లింగ్ సామర్థ్యాలను పెంచేందుకు బుధవారం పరీక్ష నిర్వహించారు. మండలంలోని రెండు కాంప్లెక్స్‌ల పరిధిలోని విద్యార్థులు పాల్గొన్నారు. పేర్కొన్నారు. కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలు నర్సిములు, రాజేష్‌కుమార్, సీఆర్పీలు నర్సిములు, రోజాలు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ఉపాధ్యాయులతో ఎంఈఓ లక్ష్మీనారాయణ

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈఓ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంపై సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశంను ఏర్పాటు చేసి సూచనలు అందించారు. ఉపాధ్యాయులు రాజేష్, సీఆర్పీ అమీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ



నట్టల నివారణ మందులు వేస్తున్న సిబ్బంది

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో బుధవారం 600 గొర్రెలకు, 650 మేకలకు నట్టల నివారణ మందులను వేసినట్లు పశువైద్యులు లింగప్ప తెలిపారు. పెంపకందారులు జీవులకు నట్టల మందులను తప్పనిసరిగా వేయించాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా క్యాంపును ఏర్పాటు చేసి మందులు వేస్తామన్నారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది, గోపాల మిత్ర హన్మంతురావ్, గొర్రెల కాపరులు ఉన్నారు.

విద్యాశాఖ అధికారుల తీరు సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లా విద్యాశాఖ అధికారుల తీరు సరిగా లేదని, అధికార పార్టీకి ఏజెంట్లుగా పని చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడిగెలి శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా విద్యా వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరన్నారు. పాఠశాల్లోల నీళ్ల చారు, పురుగుల అన్నం, బోరు నీళ్లు విద్యార్థులకు పెడుతున్నారని వాపోయారు. ఇదే విషయాన్ని ధన్వాడ మండలంలోని కేజీబీవీలో ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్, అసెంబ్లీ అధ్యక్షుడు హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లి గ్రామంలో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రనులను ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం సర్పంచ్ భారతి గ్రామపెద్దలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామస్తులు నర్సిములు, రాములు, తిమ్మయ్య, బాలప్ప, ప్రభాకర్, బాలయ్యగౌడ్, నర్సిరెడ్డి, శివకుమార్, అమ్మన్న, కూర్మయ్య, రాములు, సిద్దు, బీరప్ప, వెంకట్రాములు, ఖాజాప్ప, తిమ్మయ్యలు ఉన్నారు.

బీటీరోడ్డు

దామరగిద్ద: మండలంలోని లోకూర్తి నుంచి ముస్తాపేట్ వరకు పీఎంజీఎస్‌వై నిధులతో మంజూరు చేసిన బీటీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య, సర్పంచ్ లాలప్పలు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏఈ నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ పటిష్టతకు కృషిచేద్దాం'



మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

కోస్గి: రానున్న ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర ఉపాధ్యాక్షుడు భరత్ గౌడ్ అన్నారు. గతవారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'ప్రజా గోస...బీజేపీ భరోసా' ముగింపు కార్యక్రమం మంగళవారం రాత్రి మండల పరిధిలోని హన్మాన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, జిల్లా ఉపాధ్యాక్షుడు మదన్, నియోజకవర్గ కన్వీనర్ నర్సిములు, కో కన్వీనర్ కోటకొండ రాము, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు కూర వెంకటయ్య, గ్రామ అధ్యక్షుడు రమేష్, శక్తి కేంద్ర ఇంచార్జీ మహేందర్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊట్కూరు: భారతీయ జనతా పార్టీ పటిష్టతకు కృషిచేద్దామని ఆర్టీసీ కార్మిక జేఏసీ చైర్మన్ అశ్వత్థామ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని తిప్పరాస్‌పల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతాంగ సమస్యలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకే మొదటగా కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం



పేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : ప్రభుత్వంతో కలిసి పనిచేస్తే వ్యక్తులు బాగుపడుతారని, సర్కారుపై పోరాటం చేస్తే వ్యవస్థకు లాభం జరుగుతుందని తపస్ జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నర్సింహా, భాస్కర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ఊట్కూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ సంఘం బలపర్చిన ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని పెద్దజట్రం, బిజ్వార్, ఊట్కూరు ఉన్నత పాఠశాలలలో ప్రచారం చేశారు. మండల అధ్యక్షుడు రవికుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపరిచిన ఏవీఎన్‌రెడ్డిని గెలిపించుకొని సమస్యలను పరిష్కరించుకుందామని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సిములు అన్నారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

రాగి అంబలి పంపిణీ

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు రాగి అంబలిని పంపిణీ చేశారు. వేసవి సెలవులు ఇచ్చేంత వరకు ప్రతిరోజు విద్యార్థులకు రాగి అంబలి అందించనున్నట్లు హెచ్‌ఎం రియాజుద్దీన్ తెలిపారు. ఉపాధ్యాయులు తమసొంత ఖర్చులతో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని రాగి అంబలిని పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు.